# 'వాణిజ్య దౌత్యవేత్తలు కీలకం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య దౌత్యవేత్తల పాత్ర కీలకంగా మారిందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'విదేశీ వాణిజ్యం–పెట్టుబడులు' అంశంపై ఓ అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 30దాకా జరిగే ఈ కార్యక్రమానికి ఈజిప్టు నుంచి 14 మంది అగ్రశ్రేణి దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెట్‌లో తాజా పోకడలు నిపుణుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. దేశాల మధ్య దౌత్య, రాజకీయ సంబంధాలను పెంపొందించడంలో భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులూ ప్రధానమేనన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

## బీటీలో భారతీ గ్లోబల్‌కు 24.5% వాటా

### డీల్ విలువ రూ.33,500 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బ్రిటన్‌కు చెందిన బహుళజాతి టెలికం సంస్థ బీటీ గ్రూప్‌లో సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ గ్లోబల్‌కు 24.5 శాతం వాటా దక్కుతున్నది. డీల్ విలువ దాదాపు రూ.33,500 కోట్లు (4 బిలియన్ డాలర్లు). కాగా, బీటీ గ్రూప్‌లోని ఆల్టీస్ నుంచి 9.99 శాతం వాటాను వెంటనే కొనేస్తున్న భారతీ.. మిగతా వాటాను రెగ్యులేటరీ అనుమతులు వచ్చాక సొంతం చేసుకోనున్నది. అధిక రుణ భారం నేపథ్యంలోనే ఈ వాటాను ఆల్టీస్ అమ్ముకుంటున్నది. ఇదిలావుంటే టాటా, మహీంద్రా, వెల్‌స్పన్ తర్వాత బ్రిటీష్ సంస్థల్లో వాటాలను పొందిన భారతీయ సంస్థగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ నిలిచింది.









## నరహరిశర్మకు సేవారత్న అవార్డు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప సేవకుడు, వేద పండితుడు సంగనబట్ల నరహరి శర్మకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సౌత్ ఇండియా అయ్యప్ప సేవారత్న అవార్డుయ లభించింది. తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలో ఈ నెల 11న ఏబీఏపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో అవార్డు అందుకున్నారు. జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు ఆధ్వర్యంలో శభరిమల అయ్యప్ప స్వామి దేవాలయ మాజీ మేల్ శాంతులు శశి కుమార్, దామోదరం నంబూద్రి గురుస్వాముల చేతుల మీదుగా ఏబీఏపీ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ పీయన్క మీనన్లు అవార్డు అందించారు. తెలంగాణ అధ్యక్షుడు టీవీ పుల్లాం రాజు, సెక్రటరీ కర్క సిద్ధు, మూడ శ్రీనివాస్, నేషనల్ సెక్రటరీ సిరిసెట్టి రాజేశ్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బెల్లంపల్లి జీఎంకు సన్మానం

రెబ్బెన, ఆగస్టు 12 : బెల్లంపల్లి ఏరియా జీఎం, ఎస్‌వోటూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్, రాజమల్లును సోమవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానించినట్లు యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు తెలిపారు. టీబీజీకేఎస్ నాయకులు అలవేణి సంపత్, దారావత్ మంగీలాల్, గజెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, అనుముల సత్యనారాయణ, మాంతు సమ్మయ్య, గడ్డం రవీందర్, దేవేందర్, సంపతి తిరుపతి, కొండు శంకర్, మంకయ్య, వెంకటేశ్వర్లు, కరీముల్లఖాన్ పాల్గొన్నారు.

## ఒకరి ఆత్మహత్య

చింతలమానేపల్లి, ఆగస్టు 12 : డబ్బా పంచాయతీ పరిధి బారెగూడకు చెందిన నికోడె గణేశ్ (23) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ నరేశ్ తెలిపారు. మద్యానికి బానిసైన గణేశ్, పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే క్రమంలో మృతిచెందాడు. గణేశ్ తండ్రి భీంరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**పిక్లాతండాలో ఒకరు..**

లింగాపూర్, ఆగస్టు 12 : పిక్లాతండాకు చెందిన మాలోత్ బాలు(74) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బాలు మద్యానికి బానిసై, వారం నుంచి ఇంట్లో భార్యతో గొడవ పడుతున్నాడు. ఆదివారం పురుగుల మందు తాగాడు. రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలు భార్య మాలోత్ సతీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆర్కే 5, 6 గ్రూప్ గనుల ఏజెంట్‌గా శ్రీధర్ బాధ్యతలు

శ్రీరాంపూర్, ఆగస్టు 12 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5, 6 గనుల గ్రూప్ ఏజెంట్‌గా ఎన్ శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, పిట్ కార్యదర్శి గోనె రామకృష్ణ సన్మానించారు. కేంద్ర కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు రమేశ్, చంద్రశేఖర్, కొల్లూరి కృష్ణ, జీ రమేశ్, సచిన్ పాల్గొన్నారు.

**ఏజెంట్‌కు సన్మానం**

సీసీసీ నస్పూర్, ఆగస్టు 12 : ఆర్‌కే–5 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్‌ను శ్రీరాంపూర్ ఎస్‌అండ్‌పీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సిబ్బందితో కలిశారు. ఎస్‌అండ్‌పీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, కనకయ్య పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో ర్యాలీ

లక్షెట్టిపేట, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడికి నిరసనగా హిందూధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లక్షెట్టిపేటలో వివిధ పార్టీలు, ప్రజాసంగాల నాయకులు, హిందువులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12 : సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కార్యాలయం వద్ద సోమవారం జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు హనుమంతరావు, మహిపాల్, మండలాల బాధ్యులు శంకరయ్య, బాలకృష్ణ, శివానంద తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి సమష్టిగా కృషిచేయాలి

నస్పూర్, ఆగస్టు 12 : మహిళలు, యువతులు, బాలికల సంక్షేమానికి అధికార యం త్రాంగం సమష్టిగా కృషిచేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణితో కలిసి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సఖి వుమెన్ హబ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. లైంగిక వేధింపులు, గృహహింసలకు గురైన మహిళలు, యువతులు, బాలికలకు సఖి కేంద్రం ద్వారా ఆశ్రయం కల్పించి, కౌన్సెలింగ్ ద్వారా సాయం అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో 81 బాల్య వివాహాలను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి, గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు అందించాలని సూచించారు. వారంలోగా అన్ని కార్యక్రమాల పూర్తి వివరాలతో నివేదికలు అందించాలని ఆదేశించారు.

**వేడుకలు ఘనంగా నిర్వహించాలి**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి అధికారులతో వేడుకల నిర్వహణపై కలెక్టర్ కుమార్ దీపక్ సమావేశం నిర్వహించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ప్రశంసా పత్రాల కోసం వచ్చిన ప్రతిపాదనలను అదనపు కలెక్టర్, డీఆర్డీవో, కలెక్టరేట్ పరిపాలనా అధికారి, ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షకుల ఆధ్వర్యంలో పరిశీలించి, అర్హులను ఎంపికచేయాలని తెలిపారు.



భోజనం చేసేందుకు పాఠశాల పక్కన ప్లేట్లను శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు



హెచ్‌ఎంను సమస్య గురించి అడుగుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత (ఫైల్)

## అధికారులు ఆదేశించినా తాగు నీరేది..?

- కొమ్మెర జడ్పీ పాఠశాలలో పరిష్కారం కాని సమస్య

చెన్నూర్ రూరల్, ఆగస్టు 12 : కొమ్మెర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. ఈ విషయమై ఈ నెల 7న 'నమస్తే తెలంగాణ'లో 'అన్నం తిందామంటే నీళ్లు లేవు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయమై స్పెషలాఫీసర్ మల్లికార్జున్ స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరితను ఆదేశించగా, ఆమె పాఠశాలను సందర్శించారు. రెండు రోజుల్లో తాగు నీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. కానీ.. వారమైనా సమస్య పరిష్కారం కాలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నం తిన్నాక తాగేందుకు నీళ్లు లేక, మరుగుదొడ్లకు నీరు సరఫరా కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఎంఈవోగాని, ఇతర అధికారులుగాని పాఠశాల వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

మందమర్రి, ఆగస్టు 12 : సింగరేణి మందమర్రి ఏరియాలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ పా ఎన్‌వీకే శ్రీనివాస్, ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. ఏరియా జీఎం కార్యాలయంలో సోమవా రం నిర్వహించిన గ్రీవెన్స్‌లో సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఈఅండ్‌ఎం) నాగరాజు, డీజీఎం(ఐఈడీ) రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్కే ఓసీ, కేకే ఓసీ పీవోలు గోవిందరావు, రమేశ్, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, సర్వే అధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ ఉన్నారు.

## కాసిపేట గనిపై ఆందోళన

కాసిపేట, ఆగస్టు 12 : మందమర్రి ఏరియా కాసిపేట గనిలో ట్రామర్ శరత్ కుమార్ ఇటీవల ప్రమాదానికి గురై, తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, కుటుంబ సభ్యులు, కార్మికులు సోమవారం గనిపై ఆందోళనకు దిగారు. శరత్ కుమార్‌కు న్యాయం చేయాలని, గని ప్రమాదాలు అధికంగా అవుతున్నాయని, ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు గని మేనేజర్‌తో ఈ విషయంపై చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రి, ఆగస్టు 12 : రామకృష్ణాపూర్‌లోని రవీంద్రఖని రైల్వే స్టేషన్ నుంచి సోమవారం మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మంచిర్యాల రైల్వే పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు కానిస్టేబుల్ సుమన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు అప్పగిస్తామని పేర్కొన్నారు.


